క్లుప్తంగా

ఉపాధ్యాయుల ధర్నా



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు (టూటౌన్) / ఏలూరు (ఆర్ఆర్ పేట): ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు సోమవారం ధర్నా చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ఏలూరు అర్బన్, రూరల్ శాఖల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు శిక్షణా కార్యక్రమం

ఏలూరు(మెట్రో): జిల్లాలో పీ4 ఇనిషియేటివ్స్ ఎస్ఓపీపై జిల్లా స్థాయి శారీరిక శిక్షణ కార్యక్రమం మంగళవారం ఏలూరు కలక్టరేట్‌లో నిర్వహించనున్నట్టు సీపీఓ సీహెచ్ వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలానికి ఇద్దరు, మున్సిపాలిటీ నుంచి ఐదుగురు చొప్పున ఎంవోటీ (మాస్టర్ ట్రైనీలు)లకు, మండలం, మున్సిపాలిటీకి చెందిన 10 మంది జీఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి స్వర్ణ ఆంధ్ర పీ4 ఫౌండేషన్ రాష్ట్ర బృందం శిక్షణ ఇస్తుందని పేర్కొన్నారు. శిక్షణకు ఎంవోటీలు, జీఎస్‌డబ్ల్యూఎస్‌లతో పాటు యంగ్ ప్రొఫెషనల్స్, సీపీఏపీ యూనిట్‌ల సభ్యులు పాల్గొనాలన్నారు.

పొలిటికల్ సైన్స్ మేజర్ సబ్జెక్టుగా పెట్టాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీఏ మొదటి సంవత్సరంలో పొలిటికల్ సైన్స్ మేజర్ సబ్జెక్టుగా ఉండే విధంగా అనుమతి మంజూరు చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ విద్యా సంవత్సరంలో తామంతా బీఏ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకున్నామని, తమకు పొలిటికల్ సైన్స్‌పట్ల ఎంతో ఆసక్తి ఉందని విద్యార్థులు తెలిపారు ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పొలిటికల్ సైన్స్ మేజర్ సబ్జెక్టుగా లేకపోవడంతో తాము నిరాశ చెందాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టి.వంశీ కృష్ణ, కె.సుధాకర్, ఎం మహేష్, జి.సిద్ధు, కె.సుందరం తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ప్రమోషన్లు

- అదనంగా రెండు ఆర్ఐ పోస్టులు
- కార్పొరేషన్‌లో 6కు చేరిన ఆర్ఐల సంఖ్య
- డీఎంఏ అక్షింతలు వేసినా మారని తీరు
- రాజకీయ పైరవీలకే పెద్దపీట

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థలో ప్రమోషన్లు ఇష్టారాజ్యంగా కల్పిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కొందరు జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించారు. వీరిలో ఇద్దరిని ఏకంగా రెవెన్యూ విభాగంలో ఆర్ఐలుగా నియమించారు. ఇప్పటికే నలుగురు ఆర్ఐలు పనిచేస్తున్నా వీరికి అదనంగా మరో ఇద్దరిని నియమించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. కార్పొరేషన్‌లో ప్రజాప్రతినిధులు తమకు నచ్చిన వారికి పోస్టులు కట్టబెడుతున్నారనే వాదనలు బలంగా ఉన్నాయి. జనాభా పెరగకపోయినా, ఇళ్ల సంఖ్య పెరగక పోయినా అదనంగా ఇద్దరు ఆర్ఐలను నియమించడం పట్ల డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) నగరపాలక సంస్థ కమిషనర్‌ను ప్రశ్నించినట్టు తెలిసింది. దీనికి ఏం చెప్పాలో తెలియని కమిషనర్ నీళ్లు నమిలినట్టు చెబుతున్నారు.

ఇంటి పన్నుల డిమాండ్ రూ.32.31 కోట్లు

గత ఆర్థిక సంవత్సరం 2024–25లో ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఆస్తిపన్ను వసూలు లక్ష్యం రూ.32.31 కోట్లు, వాటర్ పన్ను లక్ష్యం రూ.14.48 కోట్లుగా ఉంది. పన్నుల వసూళ్లను ఆర్ఐలు ఆయా సచివాలయాలకే అప్పగించి చేతులు దులుపుకున్నారనే వాదనలు ఉన్నాయి. ఏలూరు కార్పొరేషన్‌లో ప్రారంభంలో ఇద్దరు ఆర్ఐలు మాత్రమే విధులు నిర్వహించే వారు. అప్పట్లో సచివాలయాలు లేవు. తర్వాత పెరిగిన జనాభా, పన్నుల కారణంగా ఆర్ఐల సంఖ్యను రెట్టింపు చేశారు. దీంతో ఆర్ఐల సంఖ్య నాలుగుకు పెరిగింది. ఉన్న నలుగురుకే పూర్తిస్థాయిలో పని లేకపోయినా తాజాగా మరో ఇద్దరిని ఆర్ఐలుగా నియిమించడం ఏంటనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

నగర వాసులపై అదనపు భారం

ఈ ఆర్థిక సంవత్సరం 2025–26లో ఆస్తి పన్నుపై 15 శాతం అదనంగా పెంచనున్నారు. దీంతో గత ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను లక్ష్యం అయిన రూ.32.31 కోట్లకు అదనంగా సుమారు మరో రూ.5 కోట్లు మేర అదనపు పన్ను భారం పడనుందని నగర వాసులు గగ్గోలు పెడుతున్నారు.



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

నగరపాలక సంస్థ పరిధిలో..
జనాభా 3.70 లక్షలు
డివిజన్లు50
వార్డు సచివాలయాలు 79

ప్రజాధనం దుర్వినియోగం



ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఉద్యోగుల్లో తమకు కావాల్సిన వారికి అందలం ఎక్కించే విధంగా ఇష్టానుసారంగా ఉద్యోగోన్నతులు కల్పించడం సరికాదు. అవసరం మేరకు సిబ్బందిని నియమించుకోవడంలో తప్పులేదు. అవసరం లేకపోయినా అదనపు సిబ్బందిని నియమించి ప్రజాధనం దుర్వినియోగం చేయడం సరైన నిర్ణయం కాదు.

– బి.సోమయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఏలూరు

ఇష్టారాజ్యంగా తయారైంది



కార్పొరేషన్‌లో ప్రజా ప్రతినిధుల తీరు ఇష్టారాజ్యంగా తయారైంది. ప్రభుత్వ నిర్ణయాలు, జీఓలను అమలు చేయాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నట్టు కన్పిస్తుంది. చిరు ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని ఏళ్ల తరబడి ఆందోళన చేస్తున్నా పట్టించుకోని పాలకులు పదోన్నతుల విషయంలో అత్యుత్సాహం చూపడం వెనుక మర్మం ఏమిటో అర్థం కావడం లేదు.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా



ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో వాహన తనిఖీల్లో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించిందని ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు తెలిపారు. ఈనెల 12న ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించిన ఏడుగురిపై కేసు నమోదు చేశామని చెప్పారు. వీరికి సోమవారం ఏలూరు సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో న్యాయమూర్తి కేవీఆర్ మహేశ్వరి చార్జిషీట్‌ను పరిశీలించి మద్యం పరీక్షలో రీడింగ్ అధికంగా వచ్చిన ఒకరికి రూ.4 వేలు, మిగిలిన ఆరుగురికి రూ.3 వేలు చొప్పున జరిమానా విధించారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబాల పెద్దలు, కుటుంబానికి జీవనాధారంగా నిలిచే యువకులు మృత్యువాతకు గురికావటం బాధాకరం అన్నారు. భవిష్యత్‌లోనూ మరింత విస్తృతంగా తనిఖీలు చేస్తామని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు కొత్తపేట ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై విజయవాడ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. ప్రైవేటు చిట్ ఫండ్ కంపెనీలో అటెండర్, ఏలూరు కొత్తపేటకు చెందిన దాసరి వెంకటేశ్వరరావు (58) ఆగస్టు 24న మోటారు సైకిల్‌పై వెళుతూ వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. తీవ్ర గాయాలైన అతడ్ని ఏలూరు జీజీహెచ్‌కు, అనంతరం మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం విజయవాడ తరలించారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి

ఏలూరు(మెట్రో): ఏలూరు ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్‌లో భారత రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164 జయంతిని పురస్కరించుకుని 58వ ఇంజినీర్స్ డే కార్యక్రమాన్ని రాష్ట్ర ఇరిగేషన్ ఎన్‌జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, ఇంజినీర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. బ్రిటిష్ ప్రభుత్వంలో మైసూర్ సంస్థానంలో దివాన్‌గా పనిచేస్తూ ఇంజినీర్‌గా ప్రసిద్ధి చెంది కావేరి నదిపై కృష్ణ రాజసాగర్‌ని విశ్వేశ్వరయ్య నిర్మించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నీరు, ప్రగతి ఎస్ఈ వెంకటస్వామి, పోలవరం కుడి ప్రధాన కాల్వ డిప్యూటీ ఎస్ఈ కె.రాజు, డీఈఈలు పి.గనిరాజు, దేవరకొండ వెంకటేశ్వర్లు, జేఈఈలు దేవర రాజశేఖర్, మాధవరావు, ఎన్జీఓ సంఘ నాయకులు నెరుసు రామారావు, సత్య భారతి, రిటైర్డ్ ఇంజినీర్లు రేవు సతీశ్ కుమార్, ముక్కామల కృష్ణారావు, వై.శ్రీ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్ శేషుబాబుకు సత్కారం

ఏలూరు (టూటౌన్): మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, జాతీయ ఇంజినీర్స్ డే సందర్భంగా సీనియర్ బీసీ నాయకులు సీనియర్ ఇంజినీర్ సంఘ సేవకులు బొమ్మి శేషుబాబును బీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. శేషుబాబు సేవలను నాయకులు కొనయాడారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, బీసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, బీసీ యువజన సంఘం కార్యదర్శి ఈదలాడ నాని, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పాల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు బాయి వెంకటరావు, జిల్లా ఎంప్లాయిస్ అధ్యక్షుడు పామర్తి యేసు రాజు, జిల్లా నాయకులు దవులూరి రవి తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంజినీరింగ్ రంగంలో అద్భుతాలు సృష్టించిన దేశంలో తొలితరం ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ప్రతి ఇంజినీర్ ఆదర్శంగా తీసుకుని పని చేయాలని ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్ రాజు పిలుపునిచ్చారు. సోమవారం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా స్థానిక విద్యుత్ భవన్లో ఇంజినీర్స్ డే వేడుక విద్యుత్ ఓసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఇంజినీర్లను సత్కరించారు. ఓసీ అసోసియేషన్ నాయకుడు తురగా రామకృష్ణని యూనియన్ల నాయకులు సత్కరించారు. ఆపరేషన్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేడ్కర్, రిటైర్డ్ ఎస్ఈ ఎ.రఘునాథ్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పి.రాధాకృష్ణ, టి.శశిధర్, పి.శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ ఎల్వి శ్రీనివాస్, ఆర్ భీమేశ్వరరావు, ఎ.రమాదేవి, ఎస్ సుజాత, విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు ఎం రమేష్, భూక్యా నాగేశ్వరరావు, ఎస్ అబ్బాస్, బలుసు బాబు, తారా సింగ్ పాల్గొన్నారు.

- నగరానికి చెందిన యువ ఇంజినీర్ సూరత్ తేజను ఏలూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు టి.శివ సత్యనారాయణ, కార్యదర్శి కె.బాల సుబ్రహ్మణ్యం, కోశాధికారి జి.పవన్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.



విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం



శేషుబాబును సత్కరిస్తున్న బీసీ నాయకులు



ఎస్ఈ సాల్మన్ రాజు, రిటైర్డ్ ఎస్ఈ రఘునాథబాబులను సన్మానిస్తున్న నాయకులు



యువ ఇంజినీర్ సూరత్ తేజను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

హిందీ విజేతలకు బహుమతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాజభాష హిందీ దినోత్సవాన్ని స్థానిక హిందీ నికేతన్‌లో సోమవారం నిర్వహించారు. నగరంలోని పాఠశాలల విద్యార్థులకు హిందీ వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. తొలుత సంస్థ వ్యవస్థాపకులు పిన్నింటి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హిందీ నికేతన్ అధ్యక్షుడు వి.వెంకట స్వామి మాట్లాడుతూ పిన్నింటి సత్యనారాయణ ఏలూరులో 1950 మే 2న హిందీ నికేతన్ స్థాపించారని, హిందీ భాషకు ఆయన చేసిన సేవలకు మెచ్చిన కేంద్ర ప్రభుత్వం సాహిత్య అకాడమీ అవార్డుతో సత్కరించిందని గుర్తుచేశారు. ఇక్కడి ఇప్పటి వరకు సుమారు 66 వేల మంది హిందీ విద్యను అభ్యసించారని తెలిపారు. ముఖ్యఅతిథి, రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ లేళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రముఖ హిందీ సాహిత్యకారుడుగా, నాగపూర్ రంగస్థల హిందీ నాటక దర్శకుడిగా, నటుడిగా, రేడియో ప్రసంగీకుడిగా పిన్నింటి సత్యనారాయణ సేవలు ఎన్నటికీ మరువలేనివని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో 121 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన సీనియర్స్ విభాగంలో కె.శ్రావణి, ఎం మహీధర్, పి.నాగచైతన్య, కె.జగదీష్, జూనియర్స్ విభాగంలో వై.పూర్ణిమా లలితా శ్రీ, ఎం చరణ్ శ్రీహర్ష, ఎం సుప్రియ, ఎస్ వంశీ, వక్తృతంలో సీనియర్స్ విభాగంలో టి.కుసుమ, ఎన్ క్షీరజవల్లి, కె.భువన, బి.భవాని, జూనియర్స్‌లో వై.పూర్ణిమా లలితా శ్రీ, ఎస్ హనీ వర్షిత, ఎం వినయ సాయి, జి.అభినవ్ బహుమతులు అందుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా పీఎం మోహన్ కుమార్, వై.నాగరాజు, టి.రామారావు వ్యవహరించారు. కార్యక్రమాన్ని హిందీ నికేతన్ నికేతన్ కార్యదర్శి పి.కవితా కుమారి పర్యవేక్షించారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

స్వర్ణకారులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): రోజురోజుకు బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో స్వర్ణకారుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులులక్కోజు రాజగోపాలాచారి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్వర్ణకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేక్ ఇన్ ఇండియా అంటున్న కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకే రెడ్ కార్పొరేటర్ పరుస్తుంది తప్ప స్థానిక వృత్తిదారుల్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వకర్మ యోజన పథకం స్వర్ణకారులకి ఉపయోగం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వర్ణకారులకు రూ.20 లక్షలు 40 శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని, స్వర్ణకారులు 50 సంవత్సరాలు పైబడిన వారికి నెలకి రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. స్వర్ణకారులకు పూర్తి ఉచిత వైద్యం సదుపాయం కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17న నిర్వహించే విశ్వకర్మ జయంతి రోజు జిల్లాల వారీగా ఉత్తమ స్వర్ణకారులను ఎంపిక చేసి నగదుతో కూడిన అవార్డు ఇవ్వాలని కోరారు. త్వరలో స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు.



మాట్లాడుతున్న రాజగోపాలాచారి

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	36	బీన్సచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	36
బెండకాయలు	24	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	40	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70–90
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	15	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07–10
దోసకాయలు	30	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	86
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	36
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	32
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	30
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు – తిరుపతి	16.00	4830	32

మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు



డాక్టర్ పీజే అమృతం

ఏలూరు టౌన్: స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పీజే అమృతం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఆరోగ్యవంతమైన మహిళ – శక్తివంతమైన కుటుంబం అనే నినాదంతో సమగ్ర ఆరోగ్య సేవా కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వివరించారు. ఏలూరు జిల్లాలోని పీహెచ్‌సీలు, పట్టణాల్లోని యూపీహెచ్‌సీలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల్లోనూ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆయా వ్యాధులకు సంబంధించి మహిళలకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లకు పరీక్షలు చేసి వైద్య చికిత్సలు అందిస్తారని వివరించారు. గర్భిణులు, కిషోర బాలికలు, బాలికల్లోని వ్యాధులను గుర్తించి వాటికి వైద్య చికిత్సలు అందించేలా చర్యలు చేపడతారని చెప్పారు.

వ్యభిచార గృహ నిర్వాహకుడి అరెస్ట్

ఏలూరు టౌన్: వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న వ్యక్తికి ఏలూరు రూరల్ పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఏలూరు రాఘవాచారి వీధికి చెందిన కలవకుంట్ల అశోక్‌కుమార్ ఏలూరు రూరల్ తంగెళ్లమూడి ప్రాంతం బీడీకాలనీలో వ్యభిచార కేంద్రంగా నడుపుతున్నాడు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో నిఘా ఉంచి వ్యభిచార కేంద్రంపై గత కొద్దిరోజుల క్రితం పోలీసులు దాడులు చేశారు. ప్రధాన నిందితుడు అశోక్‌కుమార్ పరారయ్యాడు. అప్పటి నుంచి అతని కోసం నిఘా వేయగా, సోమవారం రాత్రి అతని ఇంటిలో పోలీసులు అరెస్ట్ చేశారు.

ప్రజా సమస్యలపై వినతులు



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమార్‌రాజు

దెందులూరు: సోమవారం ఏలూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్ఓలు, సర్వేయర్లతో గ్రామాల వారీగా తహసీల్దార్ జి.విజయకుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మరో మూడు రోజులు పాటు వర్షాలు ఉంటాయని తెలిపారు. ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులసా విచారణ చేయాలన్నారు. లబ్ధిదారులకు రేషన్ పంపిణీలో ఫిర్యాదులు రాకుండా డీలర్లు సక్రమంగా పనిచేయాలని సూచించారు.

గ్రామస్తుల నిరసన



ధర్నాలో గ్రామస్తులు

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్‌సీపీ నేత మోరు రామరాజు ఇంటిని పెదపాడు మండలం వడ్డిగూడెం గ్రామస్తులు సోమవారం ముట్టడించారు. ఇళ్ల స్థలాల నిమిత్తం తమ నుంచి వసూలు చేసిన సొమ్ములు తిరిగి ఇవ్వాలంటూ ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మోరు రామరాజు స్పందిస్తూ.. టీడీపీ నేతలు కావాలనే తనపై కుట్రపూరితంగా బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

సమాచార శాఖ అధికారికి సత్కారం



రామచంద్రరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆర్‌వీఎస్ రామచంద్రరావు స్టేట్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఏడీగా పదోన్నతి పొంది రాజమండ్రికి వెళుతున్న నేపథ్యంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సోమవారం సత్కారం చేశారు. కార్యక్రమంలో సమాచార శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేంద్రనాథ్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేపీకే కిషోర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మాణిక్యరావు, నేతలు కిషోర్, గోపీనాథ్, జి.రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

దెందులూరు: భీమడోలు 220 కేవీ సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ మార్పు నిమిత్తం ఈ నెల 17, 18, 19 తేదీల్లో వ్యవసాయం, తాగునీరు, సర్వీసులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా తెల్లవారు జామున 2 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేడ్కర్ తెలిపారు. దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.